క్లుప్తంగా

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు



డోర్నకల్: ఎన్నికల నేపథ్యంలో డోర్నకల్ తోపాటు జిల్లా సరిహద్దులు, రైల్వే స్టేషన్‌లలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మండల పరిధిలోని రెండు చెక్‌పోస్టుల వద్ద పోలీసులు ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

కాపుసారా విక్రయదారుడిపై కేసు నమోదు

గార్ల: మండలంలోని అంజనాపురం గ్రామానికి చెందిన జి.మహేష్ కాపుసారా విక్రయిస్తుండగా అతని వద్ద నుంచి 15 లీటర్ల కాపుసారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై బానోత్ వెంకన్న బుధవారం తెలిపారు.

మద్యం ధరలకు రెక్కలు.. జోరుగా విక్రయాలు

కొత్తగూడ: ఏజెన్సీ గ్రామాల్లో మద్యం ధరలకు రెక్కలు వచ్చాయి. ఎన్నికల దృష్ట్యా మద్యం షాపులు సీజ్ కావడంతో బెల్టుషాపుల జోరు కొనసాగుతుంది. ఎన్నికల ముందు కొన్నిరోజులు ఎక్సైజ్ అధికారులు బెల్ట్‌షాపులను బంద్ చేయించి చివరకు విచ్చలవిడిగా వదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముందుగానే అంచనా వేసుకున్న బెల్టు షాపుల యజమానులు భారీగా మద్యం బాటిళ్లను డంప్ చేసుకున్నట్లు సమాచారం. షాపులో ఉన్న ధరతో పోలిస్తే రెట్టింపు ధరకు విక్రయిస్తున్నట్లు మద్యం ప్రియులు పేర్కొన్నారు. బెల్టు షాపుల యజమానుల వద్ద ఎక్సైజ్ అధికారులు డబ్బులు తీసుకుని చూసీచూడనట్లు ఉంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని మద్యం ప్రియులు కోరుతున్నారు.

టీకాలు పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలి

గూడూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ సెంటర్లలో టీకాలను పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలని డీఎంహెచ్‌ఓ అంబరీష అన్నారు. బుధవారం మండలంలోని భూపతిపేట వెల్‌నెస్‌సెంటర్, అయోధ్యపురం పీహెచ్‌సీని డీఎంహెచ్‌ఓ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణుల వివరాలు 12 వారాల్లో నమోదు చేయాలని, టీడీ వాక్సిన్లు ఇప్పించాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు వందశాతం టార్గెట్ పూర్తిచేయాలని సూచించారు. అసంక్రమిత వ్యాధులు బీపీ, షుగర్‌ను ప్రాథమిక స్థాయిలో గుర్తించి చికిత్స అందించాలన్నారు. దోమల ద్వారా వచ్చే వ్యాధుల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ మురళీధర్, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, డీపీఎం రుక్ముద్దీన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

చెన్నారావుపేట : రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలైన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సునీత ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతుండగా నర్సంపేట నుంచి మహబూబాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో వాహనంపై ఉన్న సునీతకు గాయాలు కావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

ఎయిడ్స్‌ను తరిమికొడదాం



నెక్కొండ : ఎయిడ్స్ వ్యాధిని పూర్తిగా నివారించడానికి సమష్టి కృషి చేయాలని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రేణుక అన్నారు. మండల కేంద్రంలోని విద్యోదయ గురుకుల పాఠశాలలో బుధవారం సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్ 1న నిర్వహించనున్న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ఎయిడ్స్ పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఎయిడ్స్ రోగుల పట్ల వివక్ష చూపకూడదని అన్నారు. మందులేని ఎయిడ్స్‌కు నివారణే మార్గమని ఆమె పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చల్లా నాగార్జున్‌రెడ్డి, డైరెక్టర్ చల్లా పారిజాతం, ప్రిన్సిపాల్ మహ్మద్ షరీఫ్, సంస్థ సభ్యులు లక్ష్మి, విజయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి

కేసముద్రం: కేసముద్రం, ఇనుగుర్తి మండలాల్లోని వివిధ గ్రామాల్లో గురువారం జరిగే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంతో బుధవారం అన్ని పోలింగ్ కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు చేశారు. కేసముద్రం మండలంలో 51 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఇనుగుర్తి మండలంలో 22 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

గార్ల: మండలంలోని 31 పోలింగ్ కేంద్రాల్లో నేడు జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ జి.రవీందర్ బుధవారం తెలిపాడు. పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పించినట్లు ఆయన వెల్లడించారు.

కురవి: కురవి, సీరోలు మండలాల్లోని అన్ని గ్రామాల్లో డోర్నకల్ శాసనసభకు నేడు(గురువారం) జరగనున్న ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. మరిపెడ ఎన్నికల డిస్ట్రిబ్యూటర్ కేంద్రం నుంచి కురవి, సీరోలు మండలాలకు ఎన్నికల సామాగ్రిని అధికారులు, సిబ్బంది బందోబస్తు నడుమ తీసుకొచ్చారు. కురవి, సీరోలు మండలాలకు సంబంధించిన ఎన్నికల సామాగ్రి కురవి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు చేరుకున్నాయి.

నెల్లికుదురు: ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల ఎన్నికల అధికారి తహసీల్దార్ చింతల రాజు తెలిపారు. వివిధ గ్రామాలల్లో ఏర్పాటు చేసిన 44 పీఎస్‌లకు 44పీఓలు, 44 ఏపీఓలు, 2 ఓపీఓలు మొత్తం 180 మంది సిబ్బందితో ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

చిన్నగూడూరు: నేడు జరిగే పోలింగ్ ప్రక్రియ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దార్ మహబూబ్ అలీ అన్నారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేలా అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు తాగు నీరు, టాయిలెట్స్ ఇతర సౌకర్యాలను పోలింగ్ సిబ్బందితో పాటు ఓటర్లు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకన్న, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



కురవికి ఎన్నికల సామగ్రిని తీసుకొస్తున్న అధికారులు



పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్



గార్ల: పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న ఎంపీడీఓ రవీందర్



కేసముద్రం: పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



కొత్తగూడ: గస్తీ తిరుగుతున్న కేంద్ర బలగాలు

పోలీసుల గుప్పిట్లో ఏజెన్సీ

కొత్తగూడ: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది బుధవారం చేరుకున్నారు. సిబ్బంది ఉండేందుకు ఆయా పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ పులి వెంకటేశ్వర్లు, ఇతర ఎన్నికల అధికారులు పర్యవేక్షించారు. కొత్తగూడ మండలం మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతం కావడంతో భారీగా కేంద్ర పోలీస్ బలగాలను మోహరించారు. అడవుల్లో గ్రే హౌండ్స్ బలగాలు కూంబింగ్ నిర్వహిస్తుండగా, గ్రామాల్లో ప్రత్యేక బలగాలతో ఎస్సై నగేష్, సెక్టోరల్ ఆఫీసర్ తాహెర్‌బాబాలు గస్తీ తిరుగుతున్నారు.

మహబూబాబాద్ రూరల్: మండలంలోని గ్రామాలు, తండాల్లో పోలింగ్ అధికారులు, సిబ్బంది బుధవారం వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.



మహబూబాబాద్ రూరల్: రోటిబండాలో పోలింగ్ అధికారులు, సిబ్బంది

పోలింగ్ కేంద్రంలో అసౌకర్యాలు

మహబూబాబాద్ అర్బన్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లిలో 2, 3 వార్డులు కలుపుకుని సుమారు 3040 ఓట్లు ఉండగా ఆ ప్రాంతంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రైమరీ పాఠశాలలో అక్కడి ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఆ పరిధిలో 253, 254, 256 పోలింగ్ బూతులు ఉన్నాయి. ఈ పాఠశాలలో గతంలో మరుగుదొడ్లను కాంట్రాక్టర్లు తొలగించి నూతన మరుగుదొడ్లను నిర్మిస్తామని నేటికి నిర్మాణం చేపట్టకపోవడంతో పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రైమరీ పాఠశాలలో ఒక మరుగుదొడ్డి ఉండగా మహిళా ఉపాధ్యాయులు, బాలికలు అదే మరుగుదొడ్డిని వినియోగిస్తున్నారు. నేడు సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇక్కడే ఓటు హక్కు వినియోగించుకునే ప్రజలు, అధికారుల పరిస్థితిపై ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న చాలా పాఠశాలల్లో ఇదే పరిస్థితి ఉందని ఓటర్లు తెలుపుతున్నారు.

మహా అన్నదానం

నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్‌గుప్తా ఆధ్వర్యంలో 23వ మండల పూజా మహోత్సవం బుధవారం 14వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శింగిరికొండ వేణుగోపాల్‌గుప్తా, మేర్గు స్వామి, మామిండ్ల రమేష్, కటకం అజయ్, వాంకుడోత్ రాజేందర్, ఐత సత్తయ్య, అజ్మీరా శంకర్ అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాదారపు చంద్రశేఖరం, దొడ్డ రవీందర్, శ్రీరాంతఋశ్వరయ్య, శంకరయ్య, భూపతి రాజశేఖర్, దేవాలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

యజమాని మృతికి కన్నీళ్లు కార్చిన శునకం

కేసముద్రం: అనారోగ్యంతో ఓ వ్యక్తి మృతిచెందగా, అతడి మృతదేహం వద్ద పెంచుకుంటున్న శునకం దీనంగా తిరుగుతూ, కన్నీళ్లు కార్చి తన విశ్వాసాన్ని చాటుకున్న సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. కేసముద్రంస్టేషన్‌లోని సంతోష్‌నగర్‌కాలనీకి చెందిన బొంపల్లి చిన్ని(38)అనే వ్యక్తి కొంతకాలంగా శునకాన్ని పెంచుకుంటున్నాడు. అతడు ఎంతో ప్రేమగా పెంచుకునే శునకం అతడి వెంటే వెళ్లేది. ఈక్రమంలో అనారోగ్యానికి గురై యజమాని మృతిచెందాడు. దీంతో యజమాని మృతదేహం వద్ద శునకం తిరుగుతూ, కాళ్లపై పడుకుంటూ, ముఖం వద్దకు వెళ్లి తడుముతూ యజమానిపై తన ప్రేమను చూపింది. కుక్క విశ్వాసాన్ని చూసిన వారి హృదయాలు బరువెక్కాయి.



యజమాని మృతదేహం వద్ద దీనంగా కూర్చున్న శునకం

సిద్ధమైన మోడల్ పోలింగ్ కేంద్రాలు



మానుకోటలో సిద్ధమైన మహిళా ఆదర్శ పోలింగ్ కేంద్రం



మానుకోటలో దివ్యాంగుల ఆదర్శ పోలింగ్ కేంద్రం

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని ఓటర్లు తమ ఓటును వినియోగించుకోవడానికి జిల్లా ఎన్నికల అధికారులు ప్రత్యేకంగా మహిళా ఆదర్శ పోలింగ్ కేంద్రం, దివ్యాంగుల ఆదర్శ పోలింగ్ కేంద్రం బుధవారం ఏర్పాటు చేశారు. ప్రశాంతమైన వాతావరణంలో మహిళలు దివ్యాంగులు తమ ఓటును వినియోగించుకోవడానికి ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాలను అలంకరించి ముగ్గులతో స్వాగతం పలుకుతున్నారు. పత్తిపాక గిరిజన ఆశ్రమ పాఠశాలలో మహిళా ఆదర్శ పోలింగ్ కేంద్రం, ఆర్టీసీ బస్టాండ్ గుమ్ముడూరు ప్రభుత్వ పాఠశాలలో ఆదర్శ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నేడు ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రశాంతమైన వాతావరణంలో ఓటర్లు ఓటు వినియోగించుకోవాలని ఓటర్లను అధికారులు కోరుతున్నారు.



డోర్నకల్‌లో: యువ ఆదర్శ పోలింగ్ కేంద్రం

ఆకట్టుకుంటున్న పోలింగ్ కేంద్రాలు

డోర్నకల్: డోర్నకల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన 160వ పోలింగ్ కేంద్రాన్ని మహిళా ఆదర్శ పోలింగ్ కేంద్రంగా, 163వ పోలింగ్ కేంద్రాన్ని యువ ఆదర్శ పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేసి ప్రత్యేక వసతులతో ముస్తాబు చేశారు.

ఓటర్ల పరేషాన్

- పూర్తిస్థాయిలో ఓటర్లకు అందని పోల్ చీటీలు
- గల్లంతైన ఓట్లు
- మారిన పోలింగ్ బూతులతో తలెత్తిన సమస్యలు

మహబూబాబాద్ అర్బన్: బూత్‌ల వారీగా ఓటర్ల జాబితా తయారు చేసి బీఎల్‌ఓల ద్వారా ఇంటింటికి పోల్ చీటీలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కానీ ఆ పోలింగ్ చీటీలపై ఇంటి నంబర్లు కొన్నింటిపై లేకపోవడం, సీరియల్ నంబర్ లేక, రూట్ కూడా దానిపై లేకపోవడంతో బీఎల్‌ఓలు పూర్తి స్థాయిలో పంపిణీ చేయలేదని ఓటర్లు తెలుపుతున్నారు. ఒక వార్డులో ఉన్న ఓట్లు మరో వార్డులోకి కొన్ని ఓట్లు మారడంతో ఓటర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

నానా తంటాలు..

గతంలో ఓటు వేసిన వారు పాత ఓటర్లు తమకు ఓటు ఉందని తుది జాబితాను చూసుకోకపోవడంతో చివరికి చాలామంది ఓట్లు గల్లంతయ్యాయి. ఎక్కువగా కొత్తగా నమోదు చేసుకున్న వాళ్లకు మాత్రమే తుది జాబితాను చూశారు. పాత ఓటర్లు తుది జాబితాను తీసుకోకపోవడంతో చివరికి పోల్ చిటీలు రాక నానా తంటాలు పడ్డారు.

బీఎల్‌ఓల వద్దకు పరుగు

ఓటర్లు బీఎల్‌ఓల సెల్‌ఫోన్ నంబర్లు తీసుకుని వారు ఎక్కడున్నారో తెలుసుకుని వారి వద్దకు పరుగులు తీశారు. వార్డుల వారీగా కాకుండా పోలింగ్ బూత్‌ల వారీగా జాబితాను తయారు చేశారు. దాని మూలంగా చాలా మంది ఓటర్ల పోలింగ్ బూత్‌లు మారాయి. ఎక్కడ ఉందో తెలియక అన్ని బూత్‌ల బీఎల్‌ఓల వద్దకు తిరగాల్సి వచ్చింది. వారు కూడా చేసేది ఏమిలేక వారి వద్ద ఉన్న లిస్టును చూపించడంతోపాటు కేంద్రాల వద్ద ప్రదర్శించిన జాబితాను చూసుకోవాలని సలహా ఇచ్చారు.

పూర్తిస్థాయిలో అందక..

గత ఎన్నికల్లో ప్రతి ఇంటికి పోల్‌చీటీలు పంపిణీ చేసేవారు. కానీ ప్రస్తుతం వాటిపైన రూట్‌కు సంబంధించిన సమాచారం, కొన్నింటిపై ఇంటి నంబర్లు కూడా లేకపోవడం తదితర కారణాల మూలంగా పోల్‌చీటీలు పూర్తిస్థాయిలో పంపిణీ చేయలేదు. ఎందుకు పంపిణీ చేయలేదని ఓటర్లు ప్రశ్నిస్తే జాబితా సక్రమంగా లేదని ఎలా పంపిణీ చేసేదని చేతులెత్తేశారు. ఈసారి ఓటు వెయ్యలేకపోతామని తమ పోలింగ్ కేంద్రం ఎక్కడ అని తెలుసుకోవడానికి నానా ఇబ్బందులు పడ్డారు.

గల్లంతైన ఓట్లు..

ఎన్నికల్లో తయారు చేసిన తుది జాబితాను చాలా మంది ఓటర్లు చూసుకోకపోవడం అధికారులు కూడా రెండు ప్రాంతాల్లో ఉన్నాయని తొలగించారా లేక ఇతర కారణాల వల్ల తప్పిదం జరిగిందో కానీ చాలా మంది ఓటర్ల జాబితా మాత్రం గల్లంతైంది. పోల్‌చీటీలు రాని వారంతా సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరిగినా పోలింగ్ సామగ్రి పంపిణీలో బిజీగా ఉన్న అధికారులు వారిని కలవడం సాధ్యం కాలేదు. అధికారులు మాత్రం వెబ్‌సైట్ మారడం వల్ల కొన్ని ఓటర్ల బూత్‌లు మారాయని చెబుతున్నారు. ఏది ఏమైనా ఈ ఎన్నికల్లో మాత్రం ఓటర్లు నానా ఇబ్బందులు పడ్డారు.

పోలింగ్ సామగ్రి పంపిణీ



మానుకోటలో ఎన్నికల సామగ్రితో వెళ్తున్న అధికారులు



మరిపెడలో సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక, అధికారులు



మానుకోటలో ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రిని అందజేసిన అధికారులు

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని టీఎస్ డబ్ల్యూఆర్‌ఎస్ పాఠశాలలో బుధవారం మానుకోట నియోజకవర్గానికి సంబంధించిన పోలింగ్ సామగ్రి పంపిణీ చేశారు. ఆర్వో, ఆర్డీఓ అలివేలు సమక్షంలో 16కౌంటర్లు ఏర్పాటు చేసి అధికారులు, సిబ్బందికి సామగ్రి అందజేశారు. కాగా 283 పోలింగ్ కేంద్రాలకు గానూ 283 పీఓలు, 283 ఏపీఓలు, 566 ఓపీఓలు, అదనంగా 228 సిబ్బందితో కలిపి 1,360మంది సిబ్బంది పోలింగ్ విధులు నిర్వహిస్తారని ఆర్వో తెలిపారు. 32రూట్‌లకు 32మంది రూట్ ఆఫీసర్లు, 32మంది సెక్టార్ ఆఫీసర్లు, 32 బస్సులను కేటాయించి బందోబస్తు నడుమ పోలింగ్ సామగ్రిని కేంద్రాలకు తరలించినట్లు ఆమె చెప్పారు.

పర్యవేక్షించిన కలెక్టర్..

మానుకోటలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక, ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్, ఎన్నికల అధికారులు పర్యవేక్షించారు. సిబ్బంది సందేహాలను కలెక్టర్ నివృత్తి చేయడంతో పాటు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. ఓటింగ్ శాతం పెంచేందుకు విస్తృతంగా స్వీప్ కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. డిసెంబర్ 3న కౌటింగ్ జరుగుతుందన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నిజాయితీగా ఓట్లు చేయాలన్నారు.

మరిపెడలో..

మరిపెడ: మరిపెడలోని సెయింట్ అగస్టీయన్ పాఠశాలలో డోర్నకల్ నియోజకవర్గానికి సంబంధించిన పోలింగ్ సామగ్రిని బుధవారం పంపిణీ చేసినట్లు ఆర్వో నరసింహారావు తెలిపారు. కార్యక్రమాన్ని కలెక్టర్ శశాంక, ఎస్పీ సంగ్రామ్‌సింగ్, ఎన్నికల పరిశీలకురాలు ఇరా సింఘాల్ పరిశీలించారు. నియోజకవర్గంలో 2,19, 264 మంది ఓటర్లకు 256పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కాగా పీఓలు 308, ఏపీఓలు 308, ఓపీఓఎస్‌లు 614 మొత్తం 1230మంది అధికారులు పోలింగ్ విధుల్లో పాల్గొంటారని ఆర్వో తెలిపారు. 16సెక్టార్లు, 32రూట్లు ఖరారు చేసినట్లు చెప్పారు. ఒక్కో సెక్టారుకు నలుగురు మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు తెలిపారు. 37 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించినట్లు ఆయన చెప్పారు.

ఏజెన్సీలో కోతుల బెడద

- భయాందోళనకు గురవుతున్న ప్రజలు
- ఇళ్లను ధ్వంసం చేస్తున్న వానరాలు

ఎస్‌ఎస్ తాడ్వాయి : ఏజెన్సీలో కోతల బెడద తీవ్రంగా మారింది. కోతల బీభత్సంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా ప్రజలు కోతలతో సావాసం చేయాల్సి వస్తుంది. కనురెప్ప మూసి తెరిచే క్షణంలోనే ఆదమరిస్తే కోతులు ఇంట్లోకి ప్రవేశించి నానా బీభత్సం చేయడంతో పాటు వస్తువులు, వంటపాత్రలు, ఆహార పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయి. బెదిరించే ప్రయత్నం చేసే వారిపై దాడులకు సైతం దిగుతున్నాయి. దీంతో ప్రజలు ఏమి చేయాలో ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది.

ఇళ్లు పీకి పందిరేస్తున్న కోతులు

కోతల బెడదతో ప్రజలు బయటికి రావడానికే భయపడుతున్నారు. కనీసం వారిని ఇంట్లో కూడా ప్రశాంతంగా ఉండనీయట్లేవు. పెంకుటిళ్లు, గడ్డి గుడిసెలు, రేకుల ఇళ్లు ఉన్న వారి పరిస్థితి వర్ణనాతీతం. ఇలాంటిపై ఎక్కి వాటిని తోచిన విధంగా ధ్వంసం చేస్తున్నాయి. ఇంటిల్లిపాది కూలీ పనులకు వెళ్లి వచ్చి సరికే ఇంటి పైకప్పు నుంచి ఇంట్లో దూరి ఇళ్లు పీకి పందిరేసినట్లుగా బీభత్సం చేస్తున్నాయి. మహిళలు ఆరుబయట వంటపాత్రలు శుభ్రం చేస్తున్న సమయంలో, ఏ మాత్రం కొంచెం ఆదమర్చి తలుపు తెర్చి ఉంటే ఇంట్లోకి ప్రవేశిస్తున్నాయి. అహారపాత్రలు కాపాడుకునే ప్రయత్నం చేస్తే వారిపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. చిన్నారులపై దాడి చేస్తున్నాయి.

జనం కంటే కోతులే ఎక్కువ..

ఏజెన్సీ ప్రాంతాల్లో జనం కంటే కోతుల సంఖ్య నానాటికి విస్తరిస్తుంది. తాడ్వాయి ఏజెన్సీ అటవీ ప్రాంతం కావడంతో ఇప్పటికే లక్షలాది కోతులు గ్రామాల్లో సంచరిస్తున్నాయి. ఇతర ప్రాంతాల్లో పట్టిన కోతులను ఇక్కడే అటవీ ప్రాంతంలో తీసుకువచ్చి వదిలేయడంతో అవి కూడా గ్రామాల్లోకి ప్రవేశిస్తూ ఇళ్లు, పంట పొలాలను ధ్వంసం చేస్తున్నాయి. పత్తి, వరి రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. కిరాణ షాపు, మార్కెట్‌ల్లో నుంచి వస్తువులు కొనుగోలు చేసి తీసుకొస్తున్న తరుణంలో పిల్లలు, పెద్దలు తేడా లేకుండా కోతుల గుంపులుగా వచ్చి మూకుమ్మడి దాడి చేస్తున్నాయి. హరితహారంలో నాటిని మొక్కలకు వేసిన ఫెన్సింగ్‌లను సైతం పీకేసి మొక్కలను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో పంటలకు నష్టం వాటిల్లుతున్నాయి. కోతుల బెడద తట్టుకోలేక కొన్ని గ్రామాల ప్రజలు కోతుల బెడద తప్పించిన వారికే ఓట్లు వేస్తామన్న అభిప్రాయాలు కూడా వ్యక్తం చేస్తున్నారు.



ఇంటిపై కప్పు ఎక్కుతున్న కోతులు గుంపు

కోతుల బెడద తట్టుకోలేకపోతున్నాం..

ఇంట్లో ఉండాలన్న, బయటికి వెళ్లాలన్న కోతుల బెడదను తట్టుకోలేకపోతున్నాం. ఇంటిపై పెంకులను ధ్వంసం చేయడంతో రూ.4 వేలు పెట్టి కవర్ కొని కప్పినా కోతుల ఒక్క రోజు కూడా ఉంచలేదు. అధికారులు ఎవ్వరు కూడా పట్టించుకోవడం లేదు. ఈ సారి ఎన్నికల్లో కోతుల నివారణకు చర్యలు తీసుకున్న వారికే ఓటు వేయాలనే అభిప్రాయానికి వచ్చాం.

– తాళ్లపల్లి అరుణ, తాడ్వాయి

'విద్యాసంస్థల దగ్గర వైన్స్‌లు వద్దు'

సంగెం : విద్యాసంస్థల సమీపంలో వైన్స్ షాపులను ఏర్పాటు చేయవద్దని సంగెం మండల కేంద్రంలోని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈమేరకు పలువురు గ్రామస్తులు బుధవారం కలెక్టర్‌కు, వర్ధన్నపేట ఎక్సైజ్ సీఐ స్వరూపకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సంగెం మండల కేంద్రానికి మంజూరైన 49, 50 షాపులను గతంలో కుంటపల్లి రోడ్డులో నిర్వహించేవారు. ఈ ఏడాది వాటిని అక్కడ కాకుండ సంగెం పెట్రోల్ బంకు పక్కన ఏర్పాట్లు చేస్తున్నారన్నారని తెలిపారు. అక్కడ విద్యాసంస్థలతోపాటు ఒక చర్చి కూడా ఉందని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధగా వైన్స్ ఏర్పాటు చేయవద్దని మెట్టుపల్లి రమేష్, పవన్ కార్తీక్, అశోక్, హరీష్, శంకర్, వంశీ, ఎల్లయ్య, రవి, శ్రీనివాస్ తదితరులు అధికారులను కోరారు. ఈ విషయపై వర్ధన్నపేట ఎక్సైజ్ సీఐ స్వరూపను ఫోన్‌లో వివరణ కోరడానికి ప్రయత్నించగా స్పందించలేదు.